VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 1


పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 27 మే 2026

## రాష్ట్రంలో ఫార్మ్ టు హోమ్ విధానం

● వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై కొత్త వ్యూహం ● దేవరపల్లి మండలం యడవోలు వద్ద కోకో సిటీ ● జూలైలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన ● పులివెందులలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ పూర్తికి నిధుల మంజూరు ● కొత్త ఆక్వా కనెక్షన్లకూ విద్యుత్ సబ్సిడీ వర్తింపు ● మత్స్యకారులకు 200 మెకనైజ్డ్ బోట్ల కొనుగోలుకు ఆమోదం ● వ్యవసాయ అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష




**అమరావతి,కలంకౌంటర్ :** రైతులు పండించిన ఉత్పత్తులు నేరుగా వినియోగదారుల ఇళ్లకు చేర్చేలా ఫార్మ్ టూ హోమ్ విధానం అమలు చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రత్యేకించి కూరగాయలు, పండ్ల ఉత్పత్తులు నేరుగా వినియోగదారుకు చేర్చేలా ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సహా తక్కువ వ్యయంతో ఇంటి వద్దకే చేరేలా ఈ కొత్త వ్యూహం ఉపయోగపడుతుందని అన్నారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం వ్యవసాయం, ఇతర అనుబంధ శాఖలు, ప్రాథమిక రంగంలో 6 మిషన్లపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈసారి రాష్ట్రంపై ఎల్ నినో చూపుతున్న ప్రభావాలను అంచనా వేస్తూ ప్రాంతాల వారీగా పంటల సాగు అంచనా జరగాలని, దానికి అనుగుణంగానే చర్యలు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాల్లో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పీఎండీఎస్- హాఫ్ మూన్ విధానాల్లో సేద్యం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్ నినో కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావం ఉన్నప్పటికీ రాష్ట్రంలోని రైతులు నష్ట పోకుండా పంటలకు కనీస మద్దతు ధర లభించేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ విషయంలో కేంద్ర సహకారం కూడా తీసుకుని ఏపీలో చేపడుతున్న ప్రకృతి సేద్యానికి మరింత ప్రోత్సాహం కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ సాగుతో విజయవంతమైన

- 2లో

## కలుషిత జలాలు గోదావరిలో కలిపేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు?

● గలగలా గోదారి... అని గీతం ఆలపిస్తాము... ఇంత కాలుష్యం ఉంటే ఏమని ఆలపించాలి? ● ఆంధ్ర పేపర్ మిల్స్ యాజమాన్యానికి నోటీసులు ఎందుకు ఇవ్వలేదు? ● రూ. 13 కోట్ల బకాయిలను రాబట్టలేరా? ● ప్రజల ముందు సమాధానం చెప్పాల్సింది మేము ● ఆంధ్ర పేపర్ మిల్స్ పరిశ్రమ కాలుష్యాన్ని పరిశీలించిన పవన్ కళ్యాణ్





**రాజమండ్రి,కలంకౌంటర్ :** 'మా తెలుగుతల్లికి.. రాష్ట్ర గీతంలో గల గలా గోదారి అని గుండెల నిండా ఆర్తితో ఆలపిస్తాం.. ఇక్కడకు వచ్చి చూస్తే గోదావరి వెలవెలబోతూ.. కాలుష్యంతో నిండిపోతూ కనిపిస్తోంది. ఏమని ఆలపించాలి. ఇంతటి కాలుష్యం కలుస్తున్న నీటిలో మన పిల్లలను స్నానం చేయించే సాహసం చేస్తామా..? ఇంత దారుణంగా కలుషిత జలాలు గోదావరిలోకి ప్రత్యక్షంగా కలుస్తున్నా అధికారులు ఇంకా మీనమేషాలు ఎందుకు లెక్కిస్తున్నారు?' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశ్రామిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది... పరిశ్రమలను ప్రోత్సహించాలని రాయితీ ధరలకు భూములను కేటాయిస్తున్నాం.. ప్రభుత్వం ఎంత సహకరిస్తున్నా, పరిశ్రమలకు కనీసం పర్యావరణ స్పృహ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. రాజమహేంద్రవరం ఆంధ్ర పేపర్ మిల్స్ లిమిటెడ్ పరిశ్రమ గోదావరిలోకి వదులుతున్న కాలుష్య జలాలను పవన్ కళ్యాణ్ మంగళవారం ఉదయం ప్రత్యక్షంగా పరిశీలించారు. కలుషిత నీటిని శుద్ధి చేసి గోదావరిలోకి విడుదల చేయాలి. తూర్పు లంకలోని లాగూన్స్ (మడుగులు)లో వీటిని వదులుతారు. పవన్ కళ్యాణ్ ఉదయాన్నే వెంకట నగరం ఘాట్ నుంచి పడవలో లాగూన్స్ వరకూ వెళ్లి ప్రత్యక్ష పరిశీలన చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మొబైల్ కిట్లతో నీటిలో కాలుష్య కారకాలు ఎంత ఉన్నాయి అన్నది అక్కడికక్కడే పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ స్పందిస్తూ- ప్రత్యక్షంగా గోదావరిలోకి కాలుష్య జలాలు ఈ స్థాయిలో కలుస్తున్నా ఇప్పటి వరకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎందుకు స్పందించలేదని, కనీసం నోటీసులు ఎందుకు ఇవ్వలేదని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకర్ నాయక్ ను ప్రశ్నించారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి కాలుష్య శుద్ధి ఎలా జరుగుతుంది అన్న వివరాలు తెలుసుకుంటున్నారా? క్షేత్రస్థాయిలోకి వచ్చి ఈ మడుగులను ఎన్నిసార్లు పరిశీలించారు అని ప్రశ్నించారు. గోదావరి మధ్యలోని తూర్పులంకలో అతి పెద్ద మడుగులలో కాలుష్య కారకాలు ఉన్న నీటిని నిల్వ చేసి తర్వాత, గోదావరిలోకి ఇంకిపోయేలా చేయడం ఏమిటన్నారు. మడుగుల్లోని నీరు మొబైల్ కిట్ లో మరోసారి పరీక్షలు చేయించారు. అక్కడ గుర్రపు డెక్క భారీగా పేరుకొని ఉందంటే కచ్చితంగా జలాలు కలుషితం అయినట్లే కదా అన్నారు.

**పెండింగ్ బకాయి రాబట్టలేరా?..** కూటమి ప్రభుత్వం పరిశ్రమలకు స్నేహపూర్వక భాగస్వామిగా ఉంటుంది. రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తే, యువతకు ఉపాధి

- 3లో

## తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకే మహానాడు

● కార్యకర్తే అధినేత అని ప్రపంచానికి చాటి చెప్పే మహా వేదిక ● స్త్రీశక్తి నినాదంతో నవశకానికి నాంది పలికే మహానాడు ● రెండేళ్ల విజయాలను ప్రజల ముందుంచుతాం ● అభివృద్ధి విఘాత రాజకీయాలను ఎండగడతాం ● పసుపు జెండాతో రాష్ట్రం మొత్తం పండుగ వాతావరణం ● వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, కలంకౌంటర్ :** తెలుగు ప్రజలు ఘనంగా చేసుకునే ఆత్మీయ రాజకీయ పండుగ మహానాడు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తే అధినేత అన్న మహోన్నత సిద్ధాంతాన్ని దేశానికి చాటి చెప్పిన చారిత్రాత్మక వేదిక మహానాడు అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి మహిళల సాధికారతకు అండగా నిలిచిందని, ఈసారి "స్త్రీశక్తి" నినాదంతో మహానాడు నిర్వహించడం గర్వకారణమన్నారు. మహిళా శక్తి, యువశక్తి, రైతు సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో మహానాడు-2026 కొత్త దిశగా ముందుకు సాగుతుందని తెలిపారు. మహిళలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసిన పార్టీ తెలుగుదేశమేనని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మహిళల అభ్యున్నతే రాష్ట్రాభివృద్ధికి బలమైన పునాది అని పార్టీ ఎప్పటినుంచో నమ్ముతోందన్నారు. మహానాడు-2026 కేవలం పార్టీ సమావేశం కాదని, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌కు దిశానిర్దేశం చేసే చారిత్రాత్మక వేదిక అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో వేగంగా నడిపించే సంకల్పానికి ఇది తొలి మెట్టు అవుతుందని తెలిపారు. రాష్ట్ర యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం, పెట్టుబడులు తీసుకురావడం, పారిశ్రామికాభివృద్ధి వేగవంతం చేయడం మహానాడు ప్రధాన ధ్యేయాల్లో ఒకటన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను మహానాడు వేదికగా ప్రజల ముందుంచుతామని మంత్రి తెలిపారు. అలాగే రాబోయే మూడేళ్లలో రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం అనుసరించే దశ, దిశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వివరిస్తారని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే ప్రభుత్వం పనిచేస్తోందనే స్పష్టమైన సంకేతాన్ని మహానాడు ద్వారా రాష్ట్రానికి అందిస్తామని పేర్కొన్నారు. రైతులు, మహిళలు, యువత, కార్మికులు సహా అన్ని వర్గాలకు ప్రభుత్వం ఏం చేయబోతుందనే దానిపై స్పష్టమైన కార్యాచరణను వెల్లడిస్తామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే గొడ్డలి పార్టీ విధ్వంసక రాజకీయాలను మహానాడు వేదికగా ప్రజాక్షేత్రంలో ఎండగడతామని మంత్రి ఘాటుగా విమర్శించారు. అభివృద్ధిని అడ్డుకోవడం, పెట్టుబడులను తరిమేయడం, యువత భవిష్యత్తును చీకటిలో నెట్టడం గత పాలకుల అసలు స్వరూపమని మండిపడ్డారు. మహానాడు-2026ను మహోత్సవంలా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు అపార ఉత్సాహంతో సిద్ధమయ్యారని మంత్రి తెలిపారు. ఇప్పటికే గ్రామగ్రామాన పసుపు జెండా రెపరెపలాడుతోందని చెప్పారు. రేపు ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ కేంద్రాలకు వేలాదిగా తరలివచ్చి మహానాడును విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. మహానాడు అంటే కేవలం సభ కాదు... అది తెలుగు జాతి గర్వం... కార్యకర్త ఆత్మవిశ్వాసం... భవిష్యత్ ఆంధ్రప్రదేశ్‌కు బంగారు బాట వేసే మహాసంకల్పం అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## నీ కథ తేలుస్తాం

నిన్ను కటకటాల్లోకి పంపే వరకు నిద్రపోం

### -రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్



**కర్నూలు,కలంకౌంటర్ :** ఆర్యవైశ్య జాతిని కించపరిచిన పంచ్ ప్రభాకర్ ఇండియా కి వస్తే నీ కథ తేలుస్తాం...నిన్ను కటకటాల్లోకి పంపే వరకు ఆర్యవైశ్యులు నిద్రపోరు.అన్ని సామాజికవర్గాలతో ఆత్మీయంగా ఉంటూ ,సమాజ సేవలో ముందుంటున్న ఆర్యవైశ్యుల్ని కించపరచడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయని మాజీ మంత్రి టీజీ వెంకటేష్ అన్నారు.మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను విమర్శించినందుకు కాదు.ఆర్యవైశ్య జాతిని కించపరిచినందుకు స్పందిస్తున్నాను.పంచ్ ప్రభాకర్ వలన అతనికి సహకరించే రాజకీయ పార్టీకి భారీ నష్టం జరుగుతుంది.పంచ్ ప్రభాకర్ పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీజీ వెంకటేష్ కోరారు. పాలిటిక్స్ లో విమర్శలు ప్రతి విమర్శలు కామన్. పంచ్ ప్రభాకర్ ఆర్య వైశ్య కమ్యునిటిపై తీవ్ర విమర్శలు చేశారు రాయలసీమలో మీసాలు తిప్పుకుని తిరిగిన నాయకులే మీసాలు దించుకొని నా దగ్గరకు వచ్చారని అన్నాను. కానీ రెడ్డి జాతి కమ్యునిటిని అన్నానని పంచ్ ప్రభాకర్ అనడం మూర్ఖత్వం. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి నా గురించి ఎంతో గొప్పగా మాట్లాడారు. ఆ విషయాలే నేను మాట్లాడాను పంచ్ ప్రభాకర్ వల్ల ఆయనకు సపోర్ట్ చేసే పార్టీలకు కొన్ని కులాలు దూరమయ్యాయి .ధమ్ము ధైర్యం ఉంటే పంచ్ ప్రభాకర్ ఇండియాకి వస్తే ఆర్య వైశ్యులు రోడ్ల వెంట తన్నుకుంటూ పోతారు. పంచ్ ప్రభాకర్ ఏదో ఒక రోజు ఇండియాకు వస్తారు. ఆ రోజు నీకథ ఎంటో తేలుస్తాం

**పంచ్ ప్రభాకర్ పై క్రిమినల్ కేసులు పెట్టాలి..** రాజ్యాంగం ప్రకారం మా కులానికి హక్కులు లేవు. ఓసీలలో వీకేస్ట్ కమ్యునిటి మాది. ఇక నుంచి మా హక్కుల కోసం హక్కుల పోరాట సమితి ద్వారా పోరాడతాం . పంచ్ ప్రభాకర్ ను కటకటాల్లోకి వెళ్లేంత వరకు మా ఆర్యవైశ్య సమాజం నిద్రపోదు. పంచ్ ప్రభాకర్ రెడ్డిపై జిల్లాల వారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు పంచ్ ప్రభాకర్ శకునిలా మారాడు. గత ప్రభుత్వంలో ఆర్యవైశ్యులపై విపరీతంగా దాడులు పెరిగాయి. ఇటీవలే కల్యాణదుర్గం, అనంతపురం జిల్లాలో ఆర్యవైశ్యులపై దాడులు జరిగాయి.

**ఆర్య వైశ్య సమాజంపై దాడులు జరుగకుండా రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా చర్యలు తీసుకోవాలి..**

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య మాట్లాడుతూ సమాజంలో శాంతి కోసం ప్రాణ త్యాగం చేసిన వాసవి అమ్మవారి చరిత్ర,దేశం కోసం,రాష్ట్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహాత్మా గాంధీ,పొట్టిశ్రీరాములు వంటి మహానుభావులు చరిత్ర,రాజకీయాల్లో సుదీర్ఘంగా సేవలందించిన పెండేకంటి వెంకట సుబ్బయ్య,కొణిజేటి రోశయ్య ల చరిత్ర తెలుసుకోవాలని పంచ్ ప్రభాకర్ కు సలహా ఇచ్చారు.సమాజంలో అన్ని వర్గాల అభిమానం పొందిన ఆర్యవైశ్యుల్ని కించపరిస్తే సహించేది లేదని ,పంచ్ ప్రభాకర్ పై చర్యలు తీసుకునేవరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు.

## వై ఎస్ జగన్ ను కలిసిన సుగాలీ ప్రీతి తల్లితండ్రులు





**తాడేపల్లి,కలంకౌంటర్ :** వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ ను సుగాలి ప్రీతి తల్లిదండ్రులు పార్వతి, రాజు నాయక్‌లు కలిసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని విన్నవించారు. 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో తమ కుమార్తె సుగాలి ప్రీతిపై అత్యంత కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన జరిగి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ తమకు న్యాయం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేసు విషయంలో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైయస్ జగన్‌కు వివరించారు. వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ కేసును సీబీఐ విచారణకు అప్పగిస్తూ జీవో జారీ చేశారని, అంతేకాక తమ కుటుంబానికి కర్నూలు నగరంలో 5 సెంట్ల ఇంటి స్థలం, 5 ఎకరాల వ్యవసాయ భూమి, ప్రీతి తండ్రి రాజు నాయక్‌కు ప్రభుత్వ ఉద్యోగం కల్పించారని ప్రీతి తల్లిదండ్రులు గుర్తుచేశారు. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసును పూర్తిగా పక్కనపెట్టిందని, సీబీఐ విచారణ కూడా నిలిచిపోయిందని తెలిపారు. తిరిగి సీబీఐ విచారణ పునరుద్ధరించేలా న్యాయ సహాయం అందించాలని వైయస్ జగన్‌ను కోరారు. అంతేకాక బాధిత కుటుంబానికి ఇవ్వాల్సిన పెన్షన్‌ను కూడా టీడీపీ ప్రభుత్వం నిలిపివేసిందని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారనే కారణంతో పెన్షన్ ఇవ్వడం లేదని స్థానిక అధికారులు తమకు చెప్పారని ప్రీతి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలంలో ఇంటి నిర్మాణానికి సాయం చేయాలని పలుమార్లు కోరినా చంద్రబాబు ప్రభుత్వం తమ గోడు పట్టించుకోవడం లేదని వారు వైయస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రీతి తల్లిదండ్రుల ఆవేదనను సావధానంగా విన్న వైయస్ జగన్ వారికి న్యాయం జరిగేలా అన్ని విధాలా కృషి చేస్తామని, అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. గతంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ప్రీతి కుటుంబానికి అందించిన సహాయాన్ని గుర్తుచేస్తూ, భవిష్యత్తులో కూడా వారి కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

# అధిక ఉష్ణోగ్రతలు, సాంకేతిక కారణాలతోనే విద్యుత్ అంతరాయాలు

● రాష్ట్ర వినియోగానికి సరిపడా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది ● అనుమతులు లేని హోర్డింగ్ లతో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం ● అక్టోబర్ నాటికి రాష్ట్రంలో సబ్ స్టేషన్ల నిర్మాణాలన్నీ పూర్తి ● సమస్యల సత్వర పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ 1912 ● ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో 49 డిగ్రీల ఉష్ణోగ్రతలు వరకు నమోదవుతున్న నేపథ్యంలో, విద్యుత్ వినియోగం కూడా పెరిగిందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. అత్యధిక విద్యుత్ వినియోగంతో ట్రాన్స్ మిషన్ లైన్లు దెబ్బతినడం, ట్రాన్స్ ఫార్మర్లు వేడెక్కడం వంటి సాంకేతిక కారణాలతోనే కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. అమరావతిలోని క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి సరిపడా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కోతలు ఎక్కడా లేవని, కేవలం పలు సాంకేతిక కారణాలతోనే విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి స్పష్టం చేశారు. వినియోగదారులు విద్యుత్ సమస్యలపై సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేసి సమాచారం అందించవచ్చని వివరించారు. మూడు డిస్కంల పరిధిలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్లలో సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటారని మంత్రి తెలిపారు. సమస్యల త్వరిత పరిష్కారం కోసం కాల్ సెంటర్లలో ఇప్పటికే అదనపు సిబ్బందిని నియమించామన్నారు. ఈదురు గాలులు, వానల వలన స్తంభాలు పడిపోయి, చాలా ప్రాంతాల్లో కండక్టర్లు కట్ అవుతున్నాయన్నారు. దీనితో కూడా విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయన్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం విద్యుత్ శాఖ సిబ్బంది రాత్రనకా, పగలనకా కష్టపడుతున్నారని చెప్పారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం కొన్ని సార్లు చుట్టు పక్కల ప్రాంతాలలోనూ కొంత సమయం సరఫరాను ఆపి పనులు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. సత్తెనపల్లిలో ట్రాన్స్ ఫార్మర్ల మరమత్తులు సమయంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. ప్రజలు కూడా విద్యుత్ పునరుద్ధరణ చర్యలను అర్థం చేసుకుని ఓర్పుగా ఉండాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

**వైసీపీ పాలనలో ఒక్క సబ్ స్టేషన్ ను నిర్మించలేదు....** వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఒక్క సబ్ స్టేషన్ ను కూడా నిర్మించలేదని ఇంధన మంత్రి గొట్టిపాటి విమర్శించారు. దీనితో వ్యవస్థలన్నీ స్తంభించిపోయాయన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రూ.6 వేల కోట్లతో ట్రాన్స్ కో సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న సుమారు 30 సబ్ స్టేషన్లు అక్టోబర్ నాటికి పూర్తవుతాయన్నారు. జిల్లాల వారీగా అవసరాన్ని బట్టి ట్రాన్స్ ఫార్మర్లను అప్ గ్రేడ్ చేస్తున్నామన్నారు. అప్ గ్రేడేషన్ తో పాటు సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తయితే రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకాలు ఉండవన్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఏలూరు, విజయవాడ ఎయిర్ పోర్ట్ వంటి ప్రాంతాల్లో అనుకున్న సమయానికి ముందే సబ్ స్టేషన్ నిర్మించి వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు.

**అనుమతులులేని హోర్డింగ్ లను తొలగిస్తాం....** అనుమతులు లేని హోర్డింగ్ లు, ఫ్లెక్సీల వలన విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. గాలి, వానల వలన హోర్డింగ్ లు, ఫ్లెక్సీలు ఊడి విద్యుత్ లైన్లపై పడుతున్నాయన్నారు. దీనితో లైన్లు తెగిపోయి, కండక్టర్లు ఊడిపోతున్నాయన్నారు. దీనితో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ఈ విషయాలను మున్సిపల్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి అనుమతులు లేని హోర్డింగ్ లు, ఫ్లెక్సీలు తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. తాజాగా విజయవాడలో ఇదే విధంగా హోర్డింగ్ లు విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, దానిని పునరుద్ధరించడానికి సుమారు నాలుగు గంటలకుపైగా సమయం పట్టిందన్నారు. శ్రీకాకుళం, నంద్యాల, కర్నూలు, వంటి ప్రాంతాల్లోనూ ఇదే విధంగా విద్యుత్ స్తంభాలు కూలి, కండక్టర్లు కట్ అయిపోయాయన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్యుత్ శాఖపై ఎటువంటి దృష్టి పెట్టలేదన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికతతో ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖను దేశానికే రోల్ మోడల్ గా చేస్తున్నారని ప్రశంసించారు. ఒకవైపు ఇటువంటి పనులు చేస్తూనే మరోవైపు ఆర్డీఎస్ఎస్, విద్యుత్ శాఖ అభివృద్ధి పనులు కూడా వేగంగా చేపడుతున్నామని స్పష్టం చేశారు.

# కనెక్ట్ ఏపీ లాంటి ఎక్స్పో రాబోయే తరాలకు చాలా అవసరం

● కొత్త కొత్త ఆవిష్కరణలన్ని విజయవాడ కేంద్రంగా చూడడం ఆనందదాయకం ● కనెక్ట్ ఏపీ - ఎక్స్పో కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్





**విజయవాడ(తూర్పు నియోజకవర్గం),కలంకౌంటర్ :** విజయవాడ తూర్పు నియోజకవర్గం లబ్బీపేట లోని ఎస్ ఎస్ కన్వెన్షన్ నందు కనెక్ట్ ఏపీ ఎక్స్పో కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని చిన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ బండారు కృష్ణ ఆధ్వర్యంలో కనెక్ట్ ఏపీ లాంటి ఒక గొప్ప కార్యక్రమాన్ని విజయవాడకు తీసుకురావడం శుభ పరిణామమని ఎంపీ చిన్ని తెలిపారు ఈ కార్యక్రమంలో ముఖ్యంగా కేబుల్ ఆపరేటర్లు ఓటిపి డిటిపి ఇంటర్నెట్ డ్రోన్ తో పాటు పలు హార్డ్వేర్ సంస్థలన్నిటిని ఒకే చోట వేదికగా మలచడం గొప్ప అవకాశంగా చిన్ని అభివర్ణించారు రాబోయే భవిష్యత్ తరాలన్నీ కొత్త కొత్త టెక్నాలజీస్ పైనే ఆధారపడి ఉందని ఎంపి అన్నారు మన కేబుల్స్ అదేవిధంగా టెక్నాలజీస్ అన్ని అప్గ్రేడ్ అవుతున్న తరుణంలో వాటన్నిటినీ ఇక్కడ డిస్ప్లే చేయడం వాటి గురించి అనేక విషయాలు తెలుసుకోవడం మంచి అవకాశం అని పేర్కొన్నారు ఇవాళ ఉన్న ఇంటర్నెట్ స్పీడ్ యుగంలో కొత్త టెక్నాలజీ ద్వారా కేబుల్ ఆపరేటర్స్ కూడా అప్గ్రేడ్ అవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇలాంటి ఎక్స్పో ద్వారా ప్రజలకు అవగాహన పెంపొందించడంతోపాటు అమరావతిలో భాగమైన విజయవాడ ప్రాంతంలో ఇలాంటి మరిన్ని ఎక్స్పోలు జరగడానికి అవకాశం ఉంది కాబట్టి ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ టెక్నాలజీ తెలుసుకున్న ప్రతి ఒక్కరికి నూతన ఉద్యోగ మరియు ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంది చిన్ని తెలిపారు ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన టీం అందరిని ఎంపి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కనెక్ట్ ఏపీ ఎక్స్పో కార్యక్రమ ప్రతినిధులు పాల్గొన్నారు

# తాలిం-ఏ-హునర్‌లో ఎంపికైన 250 మంది విద్యార్థులకు అభినందనలు.

- ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్.



**అమరావతి, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన తాలిం-ఏ-హునర్ టాలెంట్ టెస్ట్ ఫలితాల ఆధారంగా ఎంపికైన 250 మంది విద్యార్థులకు ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అభినందనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ పరీక్షలో విద్యార్థులు కనబరిచిన ప్రతిభ ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఎంపికైన 250 మంది విద్యార్థులకు త్వరలో డాక్యుమెంట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత జిల్లాల్లోని ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ ఆఫ్ వక్ఫ్ కార్యాలయాల్లో, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సమక్షంలో డాక్యుమెంట్ వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన పత్రాల వివరాలను ఇప్పటికే వెల్లడించామని, వెరిఫికేషన్ తేదీలను అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. అదనంగా 50 మంది విద్యార్థులను రిజర్వ్ జాబితాలో ఉంచినట్లు తెలిపారు. ఎంపికైన 250 మంది విద్యార్థుల్లో ఎవరైనా డాక్యుమెంట్ వెరిఫికేషన్ సమయంలో అర్హత ప్రమాణాలు పూర్తి చేయలేకపోయినా లేదా ఇతర కారణాలతో అనర్హులుగా తేలినా, రిజర్వ్ జాబితాలో ఉన్న అభ్యర్థులకు వారి ర్యాంకుల ఆధారంగా ప్రాధాన్యత కల్పించనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన 250 మందిలో 70 శాతం ఎంపీసీ, 30 శాతం బైపీసీ విద్యార్థులకు, మహిళలకు 41 శాతం కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థులు ఏ నిష్పత్తిలో దరఖాస్తు చేసుకున్నారో, అదే నిష్పత్తిలో పరీక్షలకు హాజరైన విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని సీట్ల కేటాయింపు పూర్తిస్థాయి పారదర్శకతతో చేపట్టినట్లు పేర్కొన్నారు. యువతలో ప్రతిభను గుర్తించి, వారికి మెరుగైన అవకాశాలు కల్పించడమే తాలిం-ఏ-హునర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

# రాష్ట్రంలో ఫార్మ్ టు హోమ్ విధానం

● వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై కొత్త వ్యూహం ● దేవరపల్లి మండలం యడవోలు వద్ద కోకో సిటీ ● జూలైలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన ● పులివెందులలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ పూర్తికి నిధుల మంజూరు ● కొత్త ఆక్వా కనెక్షన్లకూ విద్యుత్ సబ్సిడీ వర్తింపు ● మత్స్యకారులకు 200 మెకనైజ్డ్ బోట్ల కొనుగోలుకు ఆమోదం ● వ్యవసాయ అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

రైతుల సేవల్ని కూడా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. కరవు ప్రాంతాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వేర్వేరు చోట్ల పశువుల దాణా పండించేలా చూడాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణతో పాటు ఆధునీకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేసి ఏ పంటకు భూములు అనువుగా ఉన్నాయన్నది రైతులకు తెలియచేయాలన్నారు. భూసార పరీక్షలు చేసి వాటి వివరాలను రైతులు పొందేలా ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రకృతి సేద్యం సహా ఎన్ఎంఎన్ఎఫ్ పథకం అమలు కోసం కేంద్రానికి లేఖలు రాయాలని సీఎం నిర్దేశించారు. రైతు బజార్లు, ప్రైవేటు మార్కెట్లలో ప్రకృతి సేద్యం ద్వారా పండిన ఉత్పత్తులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**బ్లూ ఎకానమీగా ఆక్వారంగం అభివృద్ధి..** పులివెందులలో సెంట్రల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి అవసరమైన రూ.3 కోట్లను తక్షణమే విడుదల చేసి కార్యకలాపాలు ప్రారంభించాలని సీఎం నిర్దేశించారు. ఆక్వా జోన్లలో ఆక్వా సాగు చేసే రైతులకు ఇచ్చే విద్యుత్ సబ్సీడీ అంశంపైనా ముఖ్యమంత్రి కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆక్వా రంగానికి యూనిట్‌కు రూ.1.50 చొప్పున విద్యుత్ విద్యుత్ సబ్సీడి ఇస్తున్నామని అన్నారు. ఇప్పటికే ఇచ్చిన 50 వేల కనెక్షన్లతో పాటు కొత్తగా రిజిస్ట్రేషన్లు చేసుకున్న 12,680 ఆక్వా కనెక్షన్లకూ ఈ సబ్సిడీ వర్తింప చేయాలని ఆదేశించారు. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,100 కోట్ల ఇస్తోందని తెలిపారు. కొత్తగా ఇచ్చే కనెక్షన్లకు కూడా రూ.188 కోట్ల అదనపు సబ్సిడీని ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. రాష్ట్రంలో సాగవుతున్న 4 లక్షల ఎకరాలు ఆక్వా జోన్ పరిధిలోకి రావాలని సీఎం స్పష్టం చేశారు. ఆక్వా రంగంలో క్వాలిటీ సర్టిఫికేషన్‌తో పాటు ట్రేసబిలిటీ తీసుకురావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్లోనూ చేపల పెంపకం ద్వారా స్థానిక మత్స్యకారుల ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. అలాగే సముద్ర తీరంలో మత్స్యకారులకు 200 మెకనైజ్డ్ బోట్లను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. దీని కోసం రూ.240 కోట్ల మేర వ్యయం అవుతుందని అధికారులు సీఎంకు వివరించారు. బ్లూ ఎకానమీ దిశగా ఆక్వా రంగాన్ని ప్రోత్సహిస్తామని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతు బజార్లను ఆధునికంగా మార్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో 90 నియోజకవర్గాల్లో రైతు బజార్లను ఏర్పాటు చేసేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. డిజి రైతు బజార్ యాప్‌ను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖల అధికారులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు హాజరయ్యారు.

# స్వచ్ఛంద రక్తదాన శిబిరం ప్రారంభించిన మండలి వెంకట్రావు..





**మోపిదేవి,కలంకౌంటర్ :** అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా మోపిదేవి గ్రామ సచివాలయం వద్ద ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోపిదేవి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మచిలీపట్నం డా; పట్టాభి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారి నిర్వహణలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరం నీ మంగళవారం ఉదయం యువ నాయకులు మండలి వెంకట్ ట్రామ్ (రాజా) ప్రారంభించారు 26 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఎర్రంశెట్టి సుబ్బారావు లీలా బ్రహ్మేంద్ర మోపిదేవి తాసిల్దార్ హరినాథ్ చల్లపల్లి సిఐ ఈశ్వరరావు మోపిదేవి ఎస్సై గౌతమ్ కుమార్ తెలుగుదేశం పార్టీ నాయకులు యసం చిట్టిబాబు, గుడివాక శివరాం కొల్లి మురళి , విశ్వం శెట్టి రాజా మోర్ల జయలక్ష్మి జనసేన నాయకులు పోషాడపు రత్న గోపాల్ ,మెరకనపల్లి నరేష్ ,కోసూరు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే కాగిత

● బంటుమిల్లిలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే .....కాగిత కృష్ణ ప్రసాద్ ..



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నట్లు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. మంగళవారం బంటుమిల్లి వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పచ్చిరొట్ట విత్తనా పంపిణీ కార్యక్రమాన్ని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు రైతులకు ఆయన స్వయంగా విత్తన బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, భూసారాన్ని పెంచుకోవడంలో పచ్చిరొట్ట ఎరువులైన జనుము, పిల్లిపెసర వంటివి ఎంతో కీలమన్నారు.. వీటి సాగు వల్ల భూమికి అవసరమైన నత్రజని లభిస్తుందని, తద్వారా దిగుబడులు పెరుగుతాయని రైతులకు వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటలు పండించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గవ్యాప్తంగా అన్ని రైతు సేవ కేంద్రాల్లో (RSK) విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ విత్తనాల పంపిణీలో ఎటువంటి జాప్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే కాగిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# స్కందపురి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన స్కందపురి సేవా సమితి చలివేంద్రం వద్ద స్కందపురి సేవాసమితి అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి తాపం వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో స్కందపురి సేవా సమితి ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

# ఐ వి ఎఫ్ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షులుగా గాయత్రి



**చీరాల,కలంకౌంటర్ :** బాపట్ల జిల్లా వేటపాలెం కు చెందిన చుండూరు.గాయత్రి ని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా విభాగం లో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోనా శ్రీనివాసరావు, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మండా.పద్మావతి ..ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ తనపై విశ్వా సంతో ఈ బాధ్యత అప్పగించిన కోనా శ్రీనివాసరావు, మండా పద్మావతి లకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఐ వి ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సీతారామాంజనేయులు



**మార్టూరు,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవిభాగంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గామార్టూరు కి చెందిన కనమలపూడి.సీతారామాంజనేయులు ని నియమించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోనా శ్రీనివాసరావు.

# మూగజీవాల అక్రమ రవాణా తెలిస్తే సమాచారం ఇవ్వండి

● మూగజీవాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం ● 53 ప్రత్యేక బృందాల ఏర్పాటు ● ఎస్పీ హర్ష వర్ధన్ రాజు



**ప్రకాశం జిల్లా,కలంకౌంటర్ :** రాబోవు బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రకాశం ,మార్కాపురం జిల్లాలలో ఎటువంటి మూగజీవాల అక్రమ రవాణా, చట్టవిరుద్ధ వధింపులు జరగకుండా జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రకాశం మరియు మార్కాపురం జిల్లాల స్థాయిలో మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ పి.శ్రీధర్ ని ను నోడల్ అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. పోలీసు, పశు సంవర్ధక శాఖ, రెవెన్యూ మరియు ఇతర సంబంధిత శాఖలతో కలిసి ప్రత్యేక ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు ఏర్పాటుచేసి జిల్లావ్యాప్తంగా నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలు, చెక్‌పోస్టులు, టోల్ గేట్స్, ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, అనుమానాస్పద వాహనాలను పూర్తిగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. చట్టవిరుద్ధంగా మూగజీవాలను తరలించడం, అనుమతులు లేకుండా రవాణా చేయడం, జంతు హింసకు పాల్పడడం లేదా నిబంధనలు ఉల్లంఘించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు, కోర్టు మార్గదర్శకాలు మరియు జంతు సంరక్షణ చట్టాలను ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతలు, సామాజిక సామరస్యం దెబ్బతినే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై కూడా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి, అనుమానాస్పద రవాణా లేదా అక్రమ కార్యకలాపాలపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. పోలీసు వారికి సమాచారం ఇవ్వకుండా చట్టాన్ని వారి చేతుల్లోకి తీసుకుని భౌతికదాడులకు పాల్పడితే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ప్రతి మండలానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు మొత్తం 53 ప్రత్యేక బృందాలను నియమించడం జరిగింది. అదనంగా పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందినప్పుడు పశు సంరక్షణ కార్యకర్తలు పోలీసులతో కలిసి జాయింట్ యాక్షన్ కమిటీ ద్వారానే వెళ్లి చర్యలు చేపట్టాలని సూచించారు. ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే, అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాయింట్ యాక్షన్ టీమ్‌లతో పాటు నిరంతరం పోలీసు పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో మూగజీవాల వధ జరిగిన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మత సామరస్యానికి భంగం కలగకుండా పండుగలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కమ్యూనల్ సెన్సిటివ్ ప్రాంతాల్లో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి, ప్రజల సహకారం తీసుకోవాలని, ముఖ్యమైన మసీదులు, సున్నిత ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేయాలని, అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ఉంచి, ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సున్నిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, డ్రోన్ కెమెరాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ప్రజలకు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. సంతలు, సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై వాహన తనిఖీలు నిర్వహించాలని, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని చట్టపరమైన మార్గదర్శకాలను అమలు చేయాలని, పండుగ ప్రశాంతంగా జరిగేలా బందోబస్తును ఏర్పాటు చేస్తుకోవాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశించారు. గోవధ, పశువుల అక్రమ రవాణా పై ఏదైనా సమాచారమును పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్ -9121102266, 9121102242, డయల్ -112/100, నోడల్ ఆఫీసర్ ఫోన్ నెంబర్:9121102116 తెలియచేయాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.

# ఫోటోలను అసభ్యకరంగా ఎడిట్ చేసి బెదిరింపులకు పాల్పడే సైబరు నేరగాళ్ళ పట్ల అప్రమత్తంగా ఉండాలి - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** ఇటీవల కాలంలో సైబరు నేరగాళ్ళు సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్ తదితర మాధ్యమాల ద్వారా ప్రజలను లక్ష్యంగా చేసుకొని కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఇటువంటి మోసాలు పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా లిఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ .... ఇటీవల కాలంలో కొంతమంది సైబరు నేరగాళ్ళు ప్రజలను లక్ష్యంగా చేసుకొని, వారి మొబైల్ నంబర్లుకు కొన్ని లింకులను పంపుతున్నారన్నారు. ఇటువంటి లింకులపై అవగాహనరాహిత్యంతో ఎవరైనా క్లిక్ చేస్తే, వారి వ్యక్తిగత సమాచారం, కాంటాక్ట్ నంబర్లు గుర్తు తెలియని సైబరు నేరగాళ్ళ చేతుల్లోకి వెళ్ళిపోతాయన్నారు. వీటిని అవకాశంగా చేసుకొని కొంతమంది సైబరు నేరగాళ్ళు వారు సేకరించిన ఫోటోలను అసభ్యకరంగా (న్యూడ్ ఫోటోలు) ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు (ఎ.ఐ), ఇతర సాంకేతికతతో ఎడిట్ చేసి, మీ ముఖాలతో అసభ్యకరంగా ఉన్న ఫోటోలను (న్యూడ్ ఫోటోలు) మీకే పంపి, వాటిని మొబైల్ ఫోనులో ఉండే కాంటాక్ట్ నంబర్లుకు పంపుతామని బెదిరిస్తూ, మొదట తక్కువ మొత్తంలో అనగా రూ.5,000/-, 10,000/- డబ్బులు డిమాండు చేసి అకౌంట్ క్లోజ్ చేస్తామని చెబుతారన్నారు. ఇటువంటి వ్యక్తులు చేసే బెదిరింపులకు ఎవ్వరూ భయపడవద్దని, అప్రమత్తంగా ఉండాలని, వారికి డబ్బులను ఎట్టి పరిస్థితుల్లోను పంపవద్దన్నారు. సైబరు నేరగాళ్ళ బెదిరింపులకు భయపడి, ఒకసారి డబ్బులు పంపడం మొదలుపెడితే, ఆ భయాన్ని ఆసరాగా చేసుకొని క్రమేనా లక్షల్లో డబ్బులు దోచేస్తారని జిల్లా ఎస్పీ తెలిపారు. అంతేకాకుండా రకరకాలుగా వేధింపులు, బెదిరింపులకు, బ్లాక్ మెయిలింగుకు పాల్పడతారన్నారు. ఇటువంటి ఫేక్ ఫోటోలకు ఎవరూ భయపడొద్దని జిల్లా ఎస్పీ తెలిపారు. కావున, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులను ఎట్టి పరిస్థితుల్లోను క్లిక్ చేయవద్దన్నారు. మొబైల్ ఫోనుకు గుర్తు తెలియని వ్యక్తుల నుండి లింకులు వస్తే వెంటనే అప్రమత్తమై 1930కు లేదా www.cybercrime.gov.in కు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు. ఈ తరహా సైబర్ మోసలపట్ల ప్రజలకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. ఈ తరహా మోసాలను నియంత్రించేందుకు ప్రజలు సైబరు మోసాల తీరు పట్ల అవగాహన కలిగి ఉండాలని, మొబైల్ ఫోనులకు, సోషల్ మీడియా ప్లాట్ఫామ్స్ ద్వారా వచ్చే లింకులతో యాప్ లను ఇన్ స్టాల్ చేసుకోవద్దని, వ్యక్తిగత ఫోటోలను, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేసే విషయంలో జాగ్రత్త వహించాలని, ఫోను నంబరుకు వచ్చే ఒ.టి.పి.లను, పాస్ వర్డులను ఇతరులతో పంచుకోవద్దని, అనుమానిత యాప్ లను ఫోనులో నిక్షిప్తం చేసుకోవద్దని, హ్యాకింగుకు గురికాని విధంగా బలమైన పాస్ వర్డ్సు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబరు నేరగాళ్ళు బెదిరింపులకు పాల్పడితే వారికి డబ్బులు చెల్లించకుండా సమీప పోలీసు స్టేషను లేదా సైబరు క్రైం పోలీసులను సంప్రదించాలని ప్రజలను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు.

# వేసవి విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి

● అగ్ని ప్రమాదాలపై వేగవంతమైన స్పందన ముఖ్యం ● కమ్యూనికేషన్ వ్యవస్థ క్రియాశీలంగా ఉండాలి ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ







**విజయవాడ,కలంకౌంటర్ :** వేసవి తీవ్రత దృష్ట్యా జిల్లాలో అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తుల పట్ల అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం విజయవాడ బస్ స్టేషన్ సమీపంలోని ఫైర్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అగ్నిమాపక వాహనాలు, రెస్క్యూ పరికరాలను పరిశీలించారు. అత్యవసర సేవలకు వినియోగించే ఉపకరణాలను పరిశీలించారు. ఎత్తయిన భవనాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఉపయోగించే ప్రత్యేక వాహనాన్ని పరిశీలించి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఫైర్ స్టేషన్‌లోని కమ్యూనికేషన్ వ్యవస్థ పనితీరును కూడా సమీక్షించారు. అత్యవసర సమాచారాన్ని అందుకునేలా, చేరవేసే విధంగా కమ్యూనికేషన్ వ్యవస్థ క్రియాశీలంగా ఉండాలన్నారు. ఎటువంటి సాంకేతిక లోపాలు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో ఫైర్ సర్వీసెస్ కీలక భూమిక పోషిస్తాయని పేర్కొన్నారు. వేసవి కాలంలో షార్ట్ సర్క్యూట్లతో పాటు వివిధ కారణాల వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయని... ఈ నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అప్రమత్తంగా ఉండి భద్రతా చర్యలు పాటించాలని సూచించారు. ఫైర్ 101 సర్వీసు ద్వారా వచ్చే కాల్స్‌తో పాటు పోలీస్ కంట్రోల్ రూమ్, డయల్ 100 ఇలా వివిధ మార్గాల ద్వారా వచ్చే కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు, సహాయ అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశ్‌రావు తదితరులు ఉన్నారు.

# ఇంటర్ పరీక్ష వాయిదా...

**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వం ఈనెల ఇరవైఎనిమిది బక్రీద్ సెలవు ప్రకటించిన నేపథ్యంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఇరవైఎనిమిది(28-05-2026) న జరగాల్సిన పరీక్షలు వచ్చే నెల ఐదవ తేదీకి ( 05- 06 -2026 )వాయిదా పడినట్లు ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి మరియు ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కన్వీనర్ యస్ సరళకుమారి తెలియజేసారు. ఇరవైఎనిమిది ఉదయం పూట జరగాల్సిన అర్థశాస్త్రం మొదటి సంవత్సరం పరీక్ష మరియు ఒకేషనల్ బ్రిడ్జి కోర్సు పరీక్షలు ఐదవ తేది ఉదయం తొమ్మిది గంటల కు యధావిధిగా జరుగుతుందని , ఇరవైఎనిమిది మధ్యాహ్నం జరగవలసిన మేధమేటిక్స్ 2బి మరియు ఒకేషనల్ కోర్సు బ్రిడ్జి పరీక్షలు ఐదవ తేదీ మధ్యాహ్నం రెండు ముప్పై నిమిషాలకు ప్రారంభం అవుతాయని మరియు ఐదవ తేదీన జరగాల్సిన నైతికత మరియు మానవతావిలువలు పరీక్ష పన్నెండువ (12-06-2026)తేదీన యధావిధిగా ఉదయం పదిగంటల నుంచి ఒంటిగంట వరకూ జరుగుతుందని ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ అధికారి యస్ సరళకుమారి మార్పు గమనించాలని విద్యార్థులకు సూచించారు.

# 'లేపాక్షి' ఉద్యోగులకు తీపి కబురు

● జీతాల పెంపుదలకు మంత్రి సవిత పచ్చ జెండా ● మూల వేతనంపై 10 శాతానికి పైగా పెంపు

● అమ్మకాలు పెరిగిన నేపథ్యంలో ఉద్యోగులకు బొనాంజా ● ఉద్యోగుల హర్షేతిరేకాలు


● సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కు, మంత్రి సవితకు ధన్యవాదాలు





**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న లేపాక్షి షో రూమ్ ల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రస్తుతం అందుతున్న మూల వేతనాలపై అదనంగా పది శాతానికి పైగా జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మంగళవారం లేపాక్షి ఉద్యోగులకు శుభ వార్త తెలిపారు. తాడేపల్లిని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లేపాక్షి షో రూమ్ ల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కలిసి, పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. గడిచిన రెండేళ్ల నుంచి అమ్మకాలు పెంచినట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి సవిత స్పందిస్తూ, లేపాక్షి షో రూమ్ ల్లో 2024-25లో రూ.56.47 కోట్లు, 2025-26లో రూ.60.75 కోట్ల మేర అమ్మకాలు జరపడంపై ఆనందం వ్యక్తంచేస్తూ ఉద్యోగులను అభినందించారు. పెరిగిన అమ్మకాలను దృష్టిలో పెట్టుకుని ఆయా ఉద్యోగుల స్థాయిని బట్టి 10 శాతానికి పైగా జీతాలు పెంచుతున్నట్లు అక్కడికక్కడే ప్రకటించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రూ.80 కోట్లకు అమ్మకాలు పెంచాలని దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 19 లేపాక్షి షో రూమ్ లు ఉన్నాయన్నారు. త్వరలో రాజమండ్రి ఎయిర్ పోర్టులో నూతన షో రూమ్ ను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. అన్ని లేపాక్షి షో రూమ్ లను నేటితరం అభిరుచులకు అనుగుణంగా మరమ్మతులు చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు. హస్త కళాకారులకు ఆర్థిక భరోసా కలిగించేలా 365 రోజులూ ఉపాధి కల్పించాలన్నది సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ లక్ష్య సాధనకు బద్ధులై... లేపాక్షి షో రూమ్ ల్లో అమ్మకాలు పెంచే బాధ్యత ఉద్యోగులదేనన్నారు. హస్త కళాకారులతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. పెరిగిన అమ్మకాల నేపథ్యంలో జీతాలు పెంచినట్లు మంత్రి సవిత వెల్లడించారు. జీతాల పెంపుదలపై ఉద్యోగులు హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి సవితకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీహెచ్డీసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు బీహెచ్వీఎస్ఎస్ఎన్ రాజు, మహేశ్వరరావు, బాలాజీ, భారతి, చంద్రశేఖర్, సుబ్బరావు, కిషోర్ కుమార్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం





**ముండ్లమూరి వారి పాలెం, కలంకౌంటర్ :** పొన్నలూరు మండలం ముండ్లమూరి వారి పాలెం గ్రామంలో పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం జరిగింది. ఆలయ అర్చకులు, టీటీడీ వేద పండితులు పరుచూరి సీతారామాచార్యులు, నారాయణ అవినాష్ స్వామి, ఫణీంద్ర స్వాములు స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా, ఎంతో వైభవంగా నిర్వహించారు. స్వామివార్లను కన్నుల పండుగగా అలంకరించారు. ఇప్పగుంట కాంతారావు దంపతులు కల్యాణోత్సవం నిర్వహించారు, వీరితో పాటు ఇప్పకుంట శ్రీకాంత్ దంపతులు, వారి సోదరులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.ఐదవ రోజు గ్రామంలో భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం రామనామ స్మరణతో మార్మోగింది. సాయంత్రం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. హనుమంత వాహనంపై సీతారామ చంద్రుల గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి ముందు వసంతోత్సవం కోలాహలంగా జరిగింది. కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ-స్తుల సహకారంతో వేలాదిమందికి అన్న ప్రసాద వినియోగం జరిగింది.

# కలుషిత జలాలు గోదావరిలో కలిపేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు?

● గలగలా గోదారి... అని గీతం ఆలపిస్తాము... ఇంత కాలుష్యం ఉంటే ఏమని ఆలపించాలి? ● ఆంధ్ర పేపర్ మిల్స్ యాజమాన్యానికి నోటీసులు ఎందుకు ఇవ్వలేదు? ● రూ. 13 కోట్ల బకాయిలను రాబట్టలేరా? ● ప్రజల ముందు సమాధానం చెప్పాల్సింది మేము ● ఆంధ్ర పేపర్ మిల్స్ పరిశ్రమ కాలుష్యాన్ని పరిశీలించిన పవన్ కళ్యాణ్





(మొదటిపేజీ తరువాయి)

దొరుకుతుందని, రాష్ట్ర ప్రగతి పరుగులు పెడుతుందని భావిస్తాం. అయితే ఇంత స్నేహపూర్వక వాతావరణంలో రాయితీలపై భూములు కేటాయిస్తున్నా సరే పరిశ్రమలు కాలుష్యం నివారణ విషయంలో సరైన దృష్టి పెట్టడం లేదు అనిపిస్తుంది. గాలి, నీరు కాలుష్యం విషయంలో ప్రతి పరిశ్రమ కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఆంధ్ర పేపర్ మిల్స్ యాజమాన్యం ప్రభుత్వానికి పన్నులు రూపేణా చెల్లించాల్సిన రూ. 13 కోట్ల బకాయిలను వెంటనే రాబట్టేలా జిల్లా యంత్రాంగం పనిచేయాలి. ప్రభుత్వం నుంచి రాయితీలు పొందుతూ బకాయిలు కట్టకపోతే ఎలా? దీనిపై సీరియస్ గా స్పందించండి. అలాగే ప్రతి ఏటా కాలుష్య నియంత్రణకు యాజమాన్యం ఎంత మేర చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటుందో..? పరిశీలించండి. ఇంత దారుణంగా కళ్ళముందే కాలుష్యం జరుగుతున్న ఇప్పటివరకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు యాజమాన్యానికి ఎందుకు నోటీసు ఇవ్వలేదో కూడా నివేదిక ఇవ్వండి అని ఆదేశించారు.

**ప్రజలకు సమాధానం చెప్పాల్సింది మేము..** 'క్షేత్రస్థాయిలో పరిస్థితులు చక్కదిద్దాల్సింది అధికారులైతే, ప్రజాక్షేత్రంలో సమాధానం చెప్పాల్సింది ప్రజా ప్రతినిధులుగా మేము. గోదావరి కాలుష్యం మీద నా కార్యాలయానికి ఫిర్యాదులు వస్తున్నాయి. అసలు నిబంధనలు క్షేత్రస్థాయిలో అమలు అవుతున్నాయా? పరిస్థితి చూస్తే దారుణంగా ఉంది. ప్రజలు ఏదైనా మమ్మల్ని ప్రశ్నిస్తారు. వారికి సమాధానం చెప్పాల్సింది మేము. ఇక్కడ ఉన్న జలాలు చూశాక - పుణ్య స్నానానికి వస్తే రోగాలు వస్తాయి. ఘాట్స్ సుందరీకరణ, ముస్తాబు చేస్తే సరిపోతుందా? అక్కడ స్నానం చేసే నీళ్లు శుద్ధిగా ఉండవద్దా? ఎస్టీపీ ప్లాంట్స్ లో నిబంధనల ప్రకారం శుద్ధి చేస్తున్నారో లేదో చూడాలి. పుష్కరాల్లో పన్నీరు స్నానం చేయించక్కర్లేదు... కెమికల్ స్నానం చేయించకూడదు కదా. కాలుష్య నియంత్రణ విషయంలో ఏవైనా సమ-స్యలు ఉంటే మా దృష్టికి తీసుకురండి. నేను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో పాటు క్యాబినెట్ లో చర్చించి బలమైన నిర్ణయం తీసుకుంటాం. స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా దీనిపై సీరియస్ గా దృష్టి సారించాలి. మేము ఉపాధి చూపిస్తున్నాం... మా ఇష్టం వచ్చినట్లు ఉంటాం అనడం సరికాదు. ప్రతి ఒక్కరూ కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు పాటించి, పర్యావరణానికి తగిన గౌరవం ఇచ్చి ముందుకు వెళ్లాలి. ఆంధ్ర పేపర్ మిల్స్ కాలుష్య పరిస్థితిపై సమగ్ర నివేదికను ఇవ్వండి. తదుపరి చర్యలు ఏం తీసుకోవాలి ఎలా ముందుకు వెళ్లాలి అన్న అంశాన్ని క్యాబినెట్లో చర్చిస్తాం " అని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు, జిల్లా అధికారులకు పవన్ కళ్యాణ్ సూచించారు. ఈ పర్యటనలో రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ , పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ , ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరీ, బత్తుల బలరామ కృష్ణ , ఉన్నతాధికారులు కాంతిలాల్ దండే , శరవణన్, కీర్తి చేకూరి ఉన్నారు.

# మర్యాద పూర్వక కలయిక



**మంగళగిరి,కలంకౌంటర్ :** ఏపీ ఐ ఐ సి కార్యాలయంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ను ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ , కాకినాడ జిల్లా అధ్యక్షులు పిబిఎస్ఎన్ కుమార్ ,నేరెళ్ల మురళి కృష్ణ, పులవర్తి శ్రీనివాస్ , కంచర్ల పాండురంగారావు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.



# టీడీపీ సెంట్రల్ ఆఫీస్ లో ఈనెల 27,28 తేదీల్లో మహానాడు నిర్వహణ

- దేశం ఔరా అనేలా.....తెలుగుజాతి మురిసేలా...హైబ్రిడ్ విధానంలో మహానాడు
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు







**ఎన్టీఆర్ భవన్, మంగళగిరి,కలంకౌంటర్ :** తెలుగుదేశంపార్టీకి, తెలుగుదేశంపార్టీ కార్యకర్తలకు అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం మహానాడు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగుజాతి మొత్తం కదలివచ్చి మేముసైతం...తెలుగుదేశంకోసం అని నినదించే అరుదైన ఘట్టం మహానాడు కార్యక్రమం. యావత్ దేశమంతా ఔరా అనేలా హైబ్రిడ్ మహానాడుతో డిజిటల్ విప్లవానికి నాంది పలకబోతున్నాం. తెలుగుదేశంపార్టీ ఆవిర్భవించిన నాటి నుండి మహానాడు కార్యక్ర మాన్ని ప్రతియేటా నిర్వహించడం ఆనవాయితీ. తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావుగారి జయంతిని పురస్కరించుకుని అత్యంత వైభవంగా తెలుగుదేశం మహానాడు కార్యక్రమాలు 3రోజులు నిర్వహించడం, లక్షలాది మంది కార్యకర్తలందరూ ఒకే వేదికగా ఏర్పడి పార్టీ ప్రణాళికల్లో భాగస్వామ్యం కావడం ఈ కార్యక్రమం ఉద్దేశం. పార్టీతో పాటు రాష్ట్ర భవిష్యత్తు కోసం తీర్మానాలు చేయడం, చర్చించడం ఈ మహానాడు లక్ష్యం.

**దేశం కోసం - డిజిటల్ అడుగులు వేస్తున్న తెలుగుదేశం :** పశ్చిమాసియా యుద్ధాల నేపథ్యంలో నెలకొన్ని కొన్ని విపత్కర పరిస్థితుల దృష్ట్యా దేశపౌరులు తమ ఖర్చులను తగ్గించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపును తెలుగుదేశంపార్టీ అందుకుంది. ప్రధాని పిలుపుకు ముందు నెల్లూరు వేదికగా మహానాడు కార్యక్రమాన్ని 3రోజులు నిర్వహించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్న తెలుగుదేశం.....దేశం యోగక్షేమాలు కోరి ఆ 3రోజుల కార్యక్రమాలను రద్దు చేసింది. మహానాడు కార్యక్రమాన్ని డిజిటల్ వేదికగా హైబ్రిడ్ విధానంలో నిర్వహించేందుకు తెలుగుదేశంపార్టీ నడుం బిగించింది. కార్యకర్తలందర్నీ డిజిటల్ వేదికగా మహానాడు కార్యక్రమంలో భాగస్వాములను చేసేందుకు వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. నేటి డిజిటల్ విప్లవంలో తెలుగుదేశంపార్టీ ఈ యేడాది నిర్వహించే హైబ్రిడ్ మహానాడు కార్యక్రమం ఒక పెద్ద విప్లవాత్మక నిర్ణ యంగా దేశ చరిత్రలోనే నిలవబోతుంది. తెలుగుదేశంపార్టీని డిజిటల్ యుగంలోకి అనుసంధానం చేయగల అనుభవజ్ఞులు, హార్వర్డ్ యూనివర్శిటీ స్టూడెంట్ మా యువనాయకులు నారా లోకేష్ సరికొత్త శకానికి నాంది పలకబోతున్నారు. సుమారు 2వేల క్లస్టర్ రీచ్ తో ఒక ప్రాంతీయ పార్టీగా తెలుగుదేశంపార్టీ రికార్డు సాధించేలా ముందుకు వెళుతోంది.

**క్లస్టర్ లో కార్యకర్తలు - కేంద్ర కార్యాలయంలో అగ్ర నాయకులు :** అమరావతిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పరిమిత సంఖ్యలో నేతలతో భౌతికంగా మహానాడు నిర్వహిస్తారు. దానికి అనుసంధానంగా నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో భారీ ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేసి.. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే మహానాడు ను అనుసంధానిస్తారు. ఎంపిక చేసిన నియోజకవర్గాల నుంచి పార్టీ కార్యకర్తలతో పాటు నేతలతో మాట్లాడిస్తారు. సాంకేతికత సాయంతో ప్రతి కార్యకర్తను నేరుగా అనుసంధానించే వినూత్న ప్రయత్నం. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,848 క్లస్టర్ల ద్వారా డిజిటల్ పద్ధతిలో మహానాడు జరగనుంది. పార్టీ అధినేత చంద్రబాబుతో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ తో వారిని మాట్లాడించడం ద్వారా.....ఒక రకమైన సంతృప్తి ఉండేలా చేస్తారు. మహానాడు హైబ్రిడ్ విధానం ద్వారా చేపట్టడం ద్వారా ఆదా అయిన సొమ్మును పార్టీ అభివృద్ధి కోసం ఖర్చు చేస్తారు. గతం మాదిరిగా వేలాదిమందికి మాత్రమే కాదు.. లక్షలాదిమందికి ఈసారి మహానాడు కనెక్ట్ అయ్యే అవకాశం ఉంది. నేరుగా పార్టీ సిద్ధాంతాలపై మరింత చర్చ జరిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.. అయితే ఇప్పుడు హైబ్రిడ్ మహానాడు పై టిడిపి కంటే ఇతర రాజకీయ పార్టీల్లోనే ఎక్కువ ఆసక్తి ఉంది.

**స్త్రీశక్తి ప్రధాన అంశంగా ఈ యేడాది మహానాడు :** స్త్రీశక్తి ప్రధాన అంశంగా ఈ యేడాది మహానాడు కార్యక్రమాన్ని తెలుగుదేశంపార్టీ నిర్వహిస్తోంది. స్త్రీశక్తిలో భాగంగా మహిళా సంక్షేమం కోసం పార్టీ చేసిన కృషి, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మహానాడు వేదిక బలంగా చర్చించనుంది. హైబ్రిడ్ విధానంనలో మహానాడు జరిగినా క్యాడర్ లో ఫుల్ జోష్ నింపడం, టెక్నాలజీ శక్తిని ప్రపంచానికి చాటిచెప్పడం, ప్రజలను అత్యధిక సంఖ్యలో భాగస్వామ్యం చేయడంలో ఈ మహానాడు చరిత్ర సృష్టించబోతుంది. మండుటెండలను సైతం లెక్కచేయకుండా తెలుగుదేశం సత్తాను డిజిటల్ వేదికగా నిరూపించడానికి, ప్రపంచ రికార్డులు సాధించే దిశగా మహానాడు అడుగులు వేస్తోంది. కాక్రోచ్ జనతాపార్టీ లాంటి అంశాలపై కూడా మహానాడు చర్చించబోతుంది. ఆరోగ్యకరమైన సోషల్ మీడియా యాక్టివిటీని ప్రోత్సహించే విధంగా మహానాడు చర్చలు ఉండబోతున్నాయి.

**ప్రతిరోజు 6గంటల పాటు మహానాడు :** హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమంలో ప్రతిరోజు 6గంటల పాటు పార్టీ తీర్మానాలు, రాష్ట్రాభివృద్ధిపై చర్చలు జరగనున్నాయి. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు డిజిటల్ మహానాడు జరగబోతుంది. క్లస్టర్ లో భారీ ఎల్.ఈ.డీ స్క్రీన్లు, ఆన్ లైన్ ద్వారా కేంద్ర కార్యాలయానికి అనుసంధానమై....పార్టీ నాయకులు, కార్యకర్తలంతా డిజిటల్ వేదికగా పాల్గొనబోతున్నారు. అన్న ఎన్టీఆర్ కి నివాళులు అర్పించేందుకు ప్రతి క్లస్టర్ వేదిక వద్ద ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నాం. క్లస్టర్ వద్ద ఉన్న పార్టీ నాయకులు ఎన్టీఆర్ గారికి నివాళులు అర్పించడం, మా తెలుగుతల్లికి మల్లెపూవు దండ పాటతో తెలుగుతల్లిని స్మరించుకుని కార్యక్రమాలు ప్రారంభించబోతున్నాం. టెక్నికల్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు, ఏర్పాట్లు ఇప్పటికే తీసుకున్నాం. ప్రతి క్లస్టర్ వద్ద ముందస్తు చర్యలతో అప్రమత్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. కార్యకర్తలు ఎవరూ అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లలో నాణ్యతా లోపాలు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం.

**10రోజులుగా కేంద్ర కార్యాలయం నుండి పర్యవేక్షణ :** రాష్ట్రవ్యాప్తంగా 1,848 క్లస్టర్లలో నిర్వహిస్తున్న హైబ్రిడ్ మహానాడు ఏర్పాట్లను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పరిశీలిస్తున్నాను. 10రోజుల నుండి తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయంలోనే ఉంటూ అన్ని క్లస్టర్లలో నాయకులు, కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నాం. ఏర్పాట్లలో పాటించాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు పార్టీ నేతలకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. ప్రతి క్లస్టర్ పార్టీ కేంద్ర కార్యాలయానికి అనునిత్యం అనుసంధానమై ఉండేలా, ఎక్కడా టెక్నికల్ సమస్యలు తలెత్తకుండా, కార్యకర్తలు నిరాశకు గురికాకుండా చేసేలా అవసరమైన ఏర్పాట్లను కట్టుదిట్టంగా తీసుకునేలా పార్టీ నేతలను అనునిత్యం అప్రమత్తం చేశాం. తెలుగుజాతి గర్వించే పసుపు పండుగకు రాష్ట్రవ్యాప్తంగా సర్వం సిద్ధం. ఈ మహానాడు కార్యక్రమాన్ని తెలుగుదేశంపార్టీ కుటుంబ సభ్యులంతా విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

# చట్టాన్ని ఉల్లంఘించే, స్కానింగ్ సెంటర్ల, మరియు ఐవీఎఫ్ సెంటర్ల పై కఠిన చర్యలు

- ఆకస్మిక తనిఖీలను ముమ్మరం చేయాలి
- క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ,కలంకౌంటర్ :** గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీ–పీఎన్‌డీటీ) చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని.. సమన్వయ శాఖల అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు, డెకాయ్ ఆపరేషన్లను ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధ చట్టం, ఏఆర్‌టీ–సరోగసీ చట్టాల అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు, సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కమ్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జ్ వీ. సునీల్ కుమార్ హాజరైన సమావేశంలో కమిటీ ఛైర్మన్, కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ....జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఫిర్యాదులు వస్తే వాటిని త్వరితగతిన విచారించి, తగు చర్యలు తీసుకోవాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని.. చట్టంలోని నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రస్తుతమున్న స్కానింగ్ కేంద్రాలకు అదనంగా కొత్త రిజిస్ట్రేషన్లకు, రెన్యువల్ దరఖాస్తులను, మార్పుచేర్పుల (మోడిఫికేషన్) దరఖాస్తులను కమిటీ పరిశీలించి, చర్చించి, ఆమోదం తెలిపింది. ప్రస్తుతం అనుమతి ఇచ్చిన స్కానింగ్ సెంటర్లన్నీ కూడా నిబంధనల ప్రకారం పనిచేయాలని, ఆదేశించారు. ఐ వి ఎఫ్ లో సక్సెస్ రేట్ ను దంపతులకు, తెలియజేసి పూర్తి భరోసా కల్పించాలని, ఏ విధంగా తప్పు నిరుపితమైన, తదుపరి రెన్యువల్ ఇవ్వకుండా, సెంటర్ను పూర్తిగా క్యాన్సిల్ చేయబడునని హెచ్చరించి నారు. అదేవిధంగా సరోగసీకి సంబంధించిన ఆరు దరఖాస్తులకు కమిటీ ఆమోదం తెలిపింది. కొత్తగా స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు, రెన్యువల్‌కు, మార్పులు, చేర్పులకు వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే కమిటీకి నివేదించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, వాసవ్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.రేష్మీ, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డా. పద్మజ, ఎన్‌హెచ్‌ఎం డీపీఎంవో డా. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మనమే మారుదాం.. మన భూమిని కాపాడుదాం..

- చెట్లను పెంచుతూ భవిష్యత్తుకు రక్షణగా నిలుద్దాం
- ప్రతి పరిశ్రమ ఆవరణలో 33 శాతం హరిత హారం తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,కలంకౌంటర్ :** మనమే మారి.. మన భూమిని కాపాడుకుందామని.. పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరముందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చెట్లను పెంచండి.. భవిష్యత్తును కాపాడండి.. అనే సందేశంతో రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 శాతం హరిత విస్తీర్ణం లక్ష్యంగా కృషిచేయాలని.. అదేవిధంగా పరిశ్రమల ఆవరణల్లో ఈ మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. చెట్లను పెంచడంతో పాటు నీటి సంరక్షణ, కాలుష్య నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలుచేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కల్పించాలని.. వర్షపు నీటి సంరక్షణ కూడా చాలా ముఖ్యమన్నారు. హరిత పట్టణాల అభివృద్ధికి గ్రీన్ బిల్డింగ్స్, ప్రజా రవాణా వినియోగం, సైక్లింగ్‌కు ప్రోత్సాహం వంటి వాటిపై దృష్టిసారించాలన్నారు. పర్యావరణ అనుకూల వస్తువులను వినియోగించాలని, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని, ఇంధన పొదుపును రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎండీ నజీనా బేగం, గనుల శాఖ డీడీ శ్రీనివాస కుమార్, ఏడీ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కేంద్ర కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లును పరిశీలించిన మంత్రులు

- ఈసారి క్షేత్రస్థాయిలో అంగరంగ వైభవంగా మహానాడుని నిర్వహిస్తున్నాం
- ప్రతి నియోజకవర్గంలో సుమారు ఐదు వేల మంది కార్యకర్తలు, నాయకులు పాల్గొంటున్నారు
- "స్త్రీ శక్తి" నినాదంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనే ప్రధాన లక్ష్యంగా మహానాడు కొనసాగుతుంది
- పొదుపు చర్యల్లో భాగంగా మహానాడుకు మహర్దశ వచ్చింది... హోం మంత్రి అనిత






**మంగళగిరి, కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లను హోం మంత్రి అనిత, మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, సవిత, గొట్టిపాటి రవికుమార్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ..ఈసారి మహానాడు పండుగ హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో పొదుపు చర్యల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో మహానాడును హైబ్రిడ్ రూపంలో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరుగుతున్న తొలి మహానాడు ఇదేనని తెలిపారు. మొదట మహానాడును నెల్లూరులో నిర్వహించాలని భావించినప్పటికీ, ఈసారి మరింత వైభవంగా క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నామని చెప్పారు. లోకేష్ నాయకత్వంలో పార్టీకి అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయని, టెక్నాలజీని వినియోగించి గ్రామ, నియోజకవర్గ స్థాయిలో కూడా నాయకులు, కార్యకర్తలు ప్రత్యక్షంగా మహానాడును వీక్షించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు ఐదు వేల మంది కార్యకర్తలు, నాయకులు పాల్గొంటూ మహానాడును వీక్షిస్తున్నారని వెల్లడించారు. పొదుపు చర్యలతో పాటు పార్టీకి కొత్త దిశను చూపించే విధంగా మహానాడు నిర్వహిస్తున్నామని, నవశకానికి నాంది పలికే తొలి అడుగుగా ఈ మహానాడు నిలుస్తుందని హోంమంత్రి పేర్కొన్నారు. ఈసారి "స్త్రీ శక్తి" నినాదంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనే ప్రధాన లక్ష్యంగా మహానాడు కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com